# 34.

# మైత్రి - దాని యథార్థ తత్త్వం

ప్రేమరహిత మరుభూములలో ప్రేమాంకురములు పెంపొంద
ప్రేమావేశముతో... ప్రేమ సుధావర్షము వర్షింపగ
ప్రేమనదులు ప్రవహింపగ మురళీ గానము సేయగదె కృష్ణా!
సకల మహీధరవన సంయుతమై జలనిధి జంతువితానయుతయై
సంతోషంబలరా... ప్రకృతి సతీమణి పరవశమున
తా చెంతన నృత్యము చేయగ మురళీ గానము సేయగదె కృష్ణా!
నీకు మిత్రులున్నారా! నీవు మిత్రునివైతివా!
మైత్రి వలన ఫలితమేమి, అనుభవించిన సుఖమేమి?
నిన్ను అతను మార్చెనా! లేక నీవు అతనిని మార్చితివా?
ఒకరినొకరు మార్చుకున్న సఖ్యమన్న అర్థమేమి?

ఈనాడు లోకమున ఒకరినొకరు అనుభవించే తత్వమును, ఒకరికొకరు అందుకునే సత్యమును, అనుభవించవలసిన నిత్యజీవితమును పంచుకొనుటకు, అనుభవించుటకు మైత్రి అత్యవసరము. కాని, పవిత్రమైన మైత్రికి తగిన అర్థము నకు, నేటి మిత్రుల యొక్క లక్షణములకు పూర్తి విరుద్ధమైన ప్రవర్తనలు మనకు కనిపిస్తున్నాయి. కాని, మైత్రి అన్నటువంటిది మహా పవిత్రమైనది. అట్టి పవిత్రమైన మైత్రియొక్క తత్వమును మన జీవితమునందు యేర్పరచుకొనుట చేత జీవితమే సార్థకము నొందుట కాకుండా, లోకమును కూడను తీర్చి దిద్దే స్థితికి పూనుకుంటుంది. ఈనాటి యొక్క మిత్రత్వము, ధనమున్నవాడిని అప్పు అడుగుతే ఆ మిత్రత్వము త్యజించిపోతుంది. ధనము లేనివానికి ధనము ఇస్తే అతని స్నేహము పూర్తిగా విరిగిపోతుంది. కనుక, ఇలాంటి క్షణభంగురమైన ధనముతోను, లేక కొన్ని పదార్థములతోను, కొన్ని రకములైన పలుకులతోను ఏర్పడే

sri sathyasaivahini amrutam

మిత్రత్వము సరియైనది కానేరదు. స్నేహమన్నటువంటిది హృదయమునకు హృదయముగా చేర్చుకున్నదే మైత్రి యొక్క సంబంధము. కష్టములయందు, నష్టములయందు, దుఃఖములయందు, సర్వకాల సర్వావస్థలయందు కూడను ఒకరినొకరు ఆదుకొని, ఒకరికొకరు సహాయపరచుకొని, ఒకరినొకరు మంచిగా తీర్చుదిద్దుకునే పరిస్థితిని అందించేదే పవిత్రమైన మైత్రి. దీనికి ఒక చిన్న ఉదాహరణము. నీకు ఒక మిత్రుడున్నాడనుకో. ఆ మిత్రుడు చేయరాని పని చేయటంచేత అనేకమంది అతనిని పట్టుకొని నిందించటానికి పూనుకుంటారు. ఈ మైత్రి యొక్క తత్త్వము ఆ మిత్రుని రక్షించే నిమిత్తము అక్కడికి వెళ్ళి, ఆ మిత్రుని దోషములను నీవు కొంత మరుగుపరచి అతనిపైన పడిన వారిని నీవు కొంత ధిక్కరించటానికి పూనుకుంటావు. ఇది మైత్రికి లక్షణమేనా? కనుక, అట్టి అన్యాయమునకు పూనుకున్న మిత్రుని నీవు ఖండించి, సత్యమార్గములో ప్రవేశింపచేయటానికి తగిన మార్గమును అందుకున్న సమయమునందే ఇది మైత్రికి సరైన అర్థమునిస్తుంది. కాని నా మిత్రుడు కదాయని అతని దోషములను నీవు మరుగుపెట్టటానికి పూనుకుంటే నీ మిత్రుని నీవు పాడు చేసినవాడవవుతావు. మిత్రుని మంచి మార్గము నందు ప్రవేశింపచేసి, మిత్రుని యొక్క సత్కీర్తిని ఆర్జించటానికి పూనుకోవటమే మైత్రి యొక్క సహజమైన అర్థము. మిత్రుని యొక్క పవిత్రతను కోరే వ్యక్తి ఆ మిత్రుని దోషములకు చక్కని శిక్ష విధించి, అతని యొక్క మంచిని అనుసరించటానికి మనము సంసిద్ధులుగా ఉండి ఒకరినొకరు ఉద్ధరించుకొనుటయే మైత్రియొక్క సహజధర్మము. ఈనాడు మైత్రి ఏరీతిగా ఉందంటే టెర్లిన్ బుష్కోట్లో పదిరూపాయలు బయటకు కనిపిస్తే హాలో హాలో అని వెళుతుంటాము. ఇక్కడ ఏ మాత్రమైనా కనిపించకపోయిందా (good bye good bye) అని వెళ్ళి పోతుంటాము. కనుక ధనమును గురించి మిత్రునిగా భావించుకోవటం, ఇది ప్రధానమైనది కాదు. హృదయ ధనమును ఆధారము చేసుకొని పవిత్రమైన ప్రేమ తత్త్వమునే లక్ష్యమునందుంచుకొని, ఈ మైత్రికి పూనుకోవటం చాలా అవసరం. దీనిని పురస్కరించుకొనియే గోపికలు పరమాత్మనే ఒక మిత్రునిగా భావించుకొని, పరమాత్మునే ఒక తల్లిగా భావించుకొని

**నీవే తల్లియు తండ్రియు**

srisathyasaivachanamrutam

**నీవే గురుడవు దైవము**
**నీవే నా సఖుడవు**
**నీవే పతియు గతియు నిజముగ కృష్ణా!**

అని ప్రార్థించారు. కనుక దైవత్వాన్ని మనసునందుంచుకొని, ప్రతి ఒక్కరి హృదయమందు అట్టి దైవత్వమనే ఆత్మ ఉన్నదనే విశ్వాసముచేత వారిని మనము మిత్రులుగా భావించుకోవటం సత్క్రమమైన మార్గము. లోకము యొక్క స్థితిగతులను గురించిగాని, వారియొక్క ఉత్తమమైన స్థానములగురించిగాని ధన కనక వస్తువాహనాదుల గురించిగాని మనము ఈ మైత్రికి పూనుకోవటం చాలా చెడుపు. అట్టి వానిని మనము చూడక, వారి హృదయమునందున్న ఆత్మ తత్వమునే గుర్తించి మనము స్నేహము చేయటము చాలా ఉత్తమమైన మార్గము. దీనిలో కుచేలుని స్నేహము గురించి మీకు అనేకరకములుగా తెలిసియే ఉండ వచ్చును. బాల్యమునందు కృష్ణునితో చేరి కుచేలుడు సాందీపుని ఇంటియందు అనేక రకములుగా ఆటలు పాటలు అన్నివిధముల చర్యలు జరిపినాడు. కృష్ణుడు గొప్పవాడు కావటంచేత, తాను చక్రవర్తి స్థానమునందు ఉండినప్పటికిని కుచేలుడు నిత్యకూటికి కరువై, కడకు బిడ్డలను కూడను పోషించుకునే శక్తిలేక తాను చాలా అవస్థలపాలైపోతున్న సందర్భంలో, ఒకనాడు కుచేలుని భార్య అయ్యో! ఇంతమంది బిడ్డలను పోషించుకోవటం చాలా కష్టము కదా! నీకు బాల్యమిత్రుడైన కృష్ణుని ఒకతూరి దర్శించి అతని అనుగ్రహాన్ని పొందుకోవటం చాలా అవసరము. మీరు వెళ్లండి అని భార్య కుచేలుని కృష్ణుని దగ్గరకు పంపింది. సరి! ఆ యొక్క ద్వారము దగ్గరకు వెళ్లేటప్పటికి ద్వారపాలకులు ఈ వేషముచూచి మహా బీదవాడగుటచేత, ఒక భిక్షగాడని భావించటంచేత కృష్ణునికి వార్త చెప్పటానికి కొంత వెనుకంజ వేశారు. అయితే, కుచేలుడు తాను చెప్పితే ఏమనుకుంటారోననే సందేహము బాధపెట్టినప్పటికిని చెప్పక తప్పదనే ఉద్దేశ్యముతో 'నేను కృష్ణుని బాల్యమిత్రుడను. కుచేలుడు వచ్చాడని ఒక వార్త కృష్ణుని కందించండి' అని ప్రార్థించాడు. ఈ వార్త వెళ్లి కృష్ణునకు తెలిపిన తక్షణమే కృష్ణుడు అన్ని రకములుగా ఏర్పాట్లు సల్పి తక్షణమే అతనిని పిలుచుకొని రమ్మని కబురుపంపాడు. కృష్ణుని చూచాడు. ఇద్దరు బాల్యమందు అనుభవించిన ఆటలు, పాటలు, మాటలు యొక్క సంభాషణలు

srisathyasaivachanamrutam

సల్పుతున్నారు. కుచేలుడు చాలా ఆనందించారు. తదుపరి ఇంటికి వెడతానని కృష్ణుని దగ్గర సెలవు తీసుకున్నాడు. ఇంటికి వెళ్లిన తక్షణమే ఏమండి ఏమిచ్చారు? ధనము ఎంతవరకు ఇచ్చారు? సిరిసంపదలు అని ఆమె ఏమాత్రము ప్రశ్నించలేదు. కారణం ఏమిటి? అక్కడ మిత్రునిపైగల ప్రేమయే ఇక్కడ సర్వము సిరిసంపదలుగా మారిపోయాయి. అతనికి ఇంటికి వెళ్లిన తక్షణమే

**నా రాక ఎరిగినంతనె వేగ రమ్మని**
**ద్వారపాలకులచేత వార్తనంపె**
**నన్ను చూచినంతనె దిగ్గున గద్దె దిగి**
**నగుమోముతోడ నన్ను అండచేర్చె**
**మోము వాచినట్లు ఎగాదిగా జూచి**
**నను కౌగిటన్ బిగుసుకొనియె**
**దేవీ! ఏమందు అతని దీనపరత**
**ప్రేమయే ఆతడు ఆతడే ప్రేమ**
**పేద కుచేలుని అటుకులు పిడికెడు తిని**
**బహుళ భాగ్యంబు నొసగువారు కలరే!**

అని వర్ణించాడు. ఇట్టి పవిత్రమైన ప్రేమతత్వము, మైత్రి అనేది హృదయములో చేరి నరనరములందు రక్తములో ప్రవహించి తన జీవితపర్యంతము మిత్రుని మరువరాని స్థితికి తెప్పించుకునే సత్యమయిన మిత్రత్వాన్ని కేవలం ఈనాడు సిరిసంపదలు కలిగిన తక్షణమే పాతమిత్రులు ఎవరైనా వచ్చి ప్రశ్నించినపుడు మీరెవరండి? అని అడిగే పరిస్థితికి ఈనాడు దిగజారింది. అవసరము వచ్చినప్పుడు ఆ మిత్రుడు అన్ని రకములుగా ఉపయోగించుకోవటం, తన అవసరము తీరిన తక్షణమే 'నీరు దాటి తెప్ప నీళ్లలో పడవేయు, నేటి మైత్రి ఎంత ఘాటకంబు' అన్నారు. ఇలాంటి మైత్రిని మనము మైత్రి అని చెప్పటం చాలా తప్పే. నిజమైన మిత్రుడు మీకు భగవంతుడే అట్టి మిత్రుని మీరు అన్ని విధముల అనుభవించుకొని తద్వారా మీ జీవిత తత్వమును ఆ మిత్రత్వములో ఐక్యమొనరించుకోవటానికి పూనుకోవటం ఇది సార్ధకత్వం. ఇట్టి పవిత్రమైన మాతృభావముగాని, మిత్ర భావముగాని మనలో అభివృద్ధి



srisathyasaivachanamrutam

కావటానికి భగవద్గీత ఎంతైనా మనకు ఆదర్శాన్ని అందిస్తుంది. మిత్రుడైన అర్జునునకు అనేక రకముల సహాయము చేసి, అనేక రకములుగా కష్టములనుండి, నష్టములనుండి తప్పించి, తెప్పించి అతనిని ఒప్పించే ప్రయత్నానికి కూడను పూనుకున్నాడు కృష్ణుడు. అలాంటి మిత్రత్వము లోపల కొన్ని సమయములందు కష్టములో, దుఃఖములో, నష్టములో కలిగి నప్పుడు వారి యొక్క ఉద్రేకములు భరించుకోవటానికి గాని, అణచుకోవటానికి గాని బలహీనులు కావటంచేత కొన్ని సూటైన మాటలు అనవచ్చును. ఆ మాటలను నిజమైన మిత్రులైతే వాటిని ఏమాత్రము పాటించక వెడుతుంటారు. ఈ మిత్రుడైన అర్జునుడు కూడను, భీమాదులు కూడను ఎన్ని కష్టములు వచ్చినప్పటికిని, అవమానములు కల్గినప్పటికిని ఆ మిత్రుడైన కృష్ణునిపై ఎట్టి అపోహలకు చోటునివ్వక విశ్వాసమును కోల్పోక నిరంతరము అతని ఆజ్ఞలనే శిరసావహించి అడుగుజాడలలో నడచినటువంటివారు. ప్రప్రథమములో యుద్ధమునకు పూర్వము నీకు నా సైన్యము కావాలా లేక నేను కావాలా అని ప్రశ్నించినప్పుడు దుర్యోధనుడు సైన్యము కావాలన్నాడు. కానీ అర్జునుడు 'స్వామీ! మీరు ఒక్కరుంటే చాలు, సర్వశక్తి మీయందే ఇమిడి ఉంది. మీరు ఒక్కరే కావాలని' అర్జునుడు ప్రార్థించాడు. ఇట్టి పవిత్రమైన మిత్రత్వముచే విజయము వరించింది. అక్కడ మిత్రత్వము ఏమాత్రము పాటించక, భుజబలము, జనబలము, ధన బలము ఆశించటంచేత దుర్యోధన దుశ్శాసనాదులకు పరాభవమే సంభవించింది. మనము మైత్రి అనే పదములోనున్న విశిష్టతను గుర్తించటంచేత మనకు ఇట్టి పవిత్రత అర్థమవుతుందిగాని, కేవలము పదములు మాత్రమే మనం వినియోగించుకుంటూ మైత్రి అంటే ఇప్పటి కాలపరిస్థితిని పురస్కరించుకొని ఏదో కొంతకాలము కలవటము, కొంతకాలము వీడిపోవటము సంయోగ వియోగముల చేత సంభవించే మైత్రి సరియైన మైత్రి కాదు. విషయములతో చేరి వచ్చేది ఈనాటి స్నేహము. విశ్వేశ్వరత్వాన్ని పురస్కరించుకొని చేరేది ఆనాటి మైత్రి. దానికి ఒక చిన్న కథ.

### పుణ్యమనే మిత్రుడే అంత్యకాలంలో మనతో వచ్చేవాడు

ఒకనికి ముగ్గురు మిత్రులు ఉండినారట. ఆ మిత్రులు అనేక రకములైన పెడ మార్గములు పట్టటంచేత అతనికి ఒక కోర్టులో కేసు ఏర్పడింది. అప్పుడు మొదటి మిత్రుని

srisathyasaivahini.org

దగ్గరకు వెళ్లి 'ఓమిత్రుడా! నాకు నీవు సాక్ష్యం చెప్పాలి. కేసు నుండి తప్పించాలి' అని అడిగాడు. ఆ మొదటి మిత్రుడు చెప్పాడు. నీవు ఎలాంటి తప్పు చేశావో, ఎలాంటి కార్యములో పాల్గొన్నావో నాకు తెలీదు అలాంటి సమయంలో నేను వచ్చి సాక్ష్యం ఇవ్వటంచేత నేను కూడను అందులో పాల్గొన్నవాడుగా భావించుకొని నాకు కూడను శిక్ష వేయవచ్చు. కనుక నేను ఇంటి దగ్గర ఉంటుండి నీకు ఏరకమైన సాక్ష్యమును కావాలన్నా ఇస్తానుగాని, నేను కోర్టుకు రాను' అని చెప్పాడు. రెండవ మిత్రుని దగ్గరకు వెళ్లి, 'నీవైనా సహాయము చేయాలని' అడిగాడు. అతను చెప్పాడు 'మిత్రుడా! నీవు ఏమి చెప్పమన్నా చెబుతాను. అయితే కోర్టు వరకు వస్తాను గాని నేను బోను దగ్గరకు వచ్చి చెప్పలేను' అన్నాడు. సరే! మూడవ మిత్రుని దగ్గరకు వెళ్లేటప్పటికి, "నాయనా! నీకు కలిగిన ఆపదలే నాకు, నా ఆపదలే నీకు. ఆపద సమయములో మంచి చెడ్డలు విచారించటం తప్పు. కనుక నీ రక్షణ కోసమై ఏమి చెప్పమన్నా చెబుతాను, ఎక్కడికి రమ్మన్నా వస్తాను" అని చెప్పాడు. ఇప్పుడు ముగ్గురు స్నేహితులందు మూడవవాడు ఉత్తముడని మనకు స్పష్టమవుతుంది. మన జీవితమునకు కూడను ఇట్టి ముగ్గురు మిత్రులుంటున్నారు. మనము గతించిన తరువాత మనయొక్క మంచి చెడ్డలను విచారించేటువంటి కోర్టు అక్కడ తయారౌతుంది. కాని, అట్టి సమయములోపల ధనకనక వస్తువాహనాదులు అనేవి ఏమాత్రము సాక్ష్యము చెప్పవు. అవి ఇంటియందే ఉండి 'నీవు మాత్రము వెళ్లవయ్యా స్మశానము వరకు' అని చెప్పి పంపిస్తుంటాయి. ఇంక మిత్రులు, బంధువులు మేము కోర్టు వరకు వస్తాము' అని స్మశానము వరకు అందరూ వెడతారు. అక్కడ అతనిని కప్పి పుచ్చుతారో, భస్మము చేస్తారో అందరు తిరిగి వాపసు వచ్చేస్తారు. కాని, తాను చేసిన పుణ్యము, తాను చేసిన మంచి కార్యములు తన వెంటనే పోయి తాను ఎక్కడికి వెడితే తనకు సహాయము చేస్తుంటాయి దనకనవస్తువాహనాదులు మనకి మొదటి మిత్రుడు. బంధువులే రెండవ మిత్రుడు, పుణ్యమే మూడవ మిత్రుడు. ఈ ధనముగాని, బంధువులుగాని మనకు ఏనాడు మనకు తగిన సహాయము చేసేవారు కాదు. ఈ ప్రపంచములో ఈ దేహమునకు సంబంధించిన వరకు కూడను వారు ఒకరికి ఒకరు కలసి మెలసి ఉండవచ్చునే తప్ప తదనంతరము పుణ్యమనే మిత్రుడే మన వెంట ఉండి మన పునర్జన్మమునకు కూడను తగిన తోడ్పాటుగా తాను నిల్చి ఉంటాడు. అందుకనే అన్నారు

srisathyasaivacchanamrutam

**బంధువులందరు వాకిటిదాకను – వల్లకాటికిని వత్తురుగా**
**బంధమణచి నిను బాయని ఆపద్బంధువు భగవన్నామమెరా!**

నీయొక్క శక్తి సామర్థ్యములుగాని, నీ యవ్వనత్వముగాని, నీ ధన కనక వస్తు వాహనాదులుగాని ఆధారము చేసుకొని నీవు మిడిసిపోవటానికి పూనుకోకు.

**అందము ప్రాయము యింద్రియశక్తియు ఉందని నిక్కకురోరన్నా**
**ముందున్నదిరా తొందరలోనే ముసలితనమ్మను ముసళ్ల పండుగ...**

కనుక వీటన్నింటిని ఆధారము చేసుకొని మనము జగత్తులో ఒకవిధంగా అహంకారములో జీవితాన్ని వ్యర్థము చేసుకోవటానికి మనము పూనుకోకూడదు. భవిష్యత్ తత్వాన్ని మనం గుర్తుంచుకొని సత్యమార్గమునందు ప్రవేశించి సరియైన మైత్రిని మనం సంపాయించుకోవటం ఉత్తమమైనదిగా భావించు కోవాలి. అట్టి సత్యనిత్యమైన ఒక మిత్రుని సంపాయించుకొనే నిమిత్తమై ఈ యొక్క వయస్సునందు మనము తగిన ప్రయత్నము సలపాలి. అనేకమంది చిన్న చిన్న పిల్లలు ఈ వయస్సునందే భజనలుగాని, ప్రార్థనలుగాని, సాధనలుగాని సల్పుతుంటే చాలామంది పెద్దలు 'ఒరే! పిచ్చివాడా! ఇంత చిన్న వయస్సు లోపలే నీకెందుకు భక్తి వైరాగ్యము. ఉద్యోగం చేసి, సంసార బాధ్యతలు అనుభవించి తదుపరి వయస్సు వచ్చిన తరువాత, రిటైరు అయిన తరువాత కూర్చోని భగవద్గీత చదువుకోటమో, పెద్దల దగ్గరకు వెళ్లటము వారి ప్రబోధలు వినటము, ఇటువంటివి చేయవచ్చని చాలా ప్రబోధిస్తారు. అయితే, ఆ వయస్సులో ఈనాడు చేయక ఆనాడు వీలవుతుందా? లేక అట్టి పవిత్రమైన భావము ఆనాడు లభిస్తుందా? లభించటం కల్ల. కనుక ఈనాటి నుండి మనము చేసినప్పుడే ఆనాటికి అట్టి సద్భావములు మనకు అభివృద్ధి కావచ్చు. ఏనాడైనా దేశములో భయంకర యుద్ధములు రావచ్చు అనే ఉద్దేశ్యముతోనే చిన్న చిన్న యువకులను మిలట్రీలో చేర్చి వాళ్లకి కొన్ని ట్రైనింగులు ఇవ్వటం సర్వ సామాన్యము. అట్లు కాకుండా యుద్ధము వచ్చిన తక్షణమే చిన్న చిన్న పిల్లలకంతా కత్తులు, తుపాకులు యిస్తే వారు ఏమి చేయగలరు. దానికి పూర్వమే ఒకవిధమైన ట్రైనింగు ఇచ్చి ఉంటే అది ఏమైనా సంప్రాప్తమైనప్పుడు అందులోచేరి దానిని ఎదుర్కోవటానికి అవకాశము ఉంటుంది. కనుక, జీవిత కాలములో చేసిన సత్కర్మలు అంత్యకాలములో

srisathyasaivachanamrutam

ఆదర్శముగా వుంటాయి మనకు. భాగవతములో చెప్పాడు.

**పదపదమంచు కింకరులు పాశము లాగెడు వేళ**
**బంధువుల్ దబదబ బయటపెట్టుడిక లాభము లేదని చెప్పువేళ**
**ఆలుబిడ్డలు లబలబ ఏడ్చువేళ తరమా హరినామము నోటను బల్క!**

కనుక, ముందుగానే అట్టి పవిత్రమైన చింత చేసిన మనము అంత్యములోపల అట్టి భావముతోనే మన జీవితమునకు పునర్జన్మమునకు పునాదిగా ఏర్పడే పవిత్ర భావములు మనలో చెలరేగవచ్చు. కనుక, మనము ఎట్టి పవిత్రకార్యములు చేయవలసి వచ్చినప్పటికిని ఎట్టి లోక కళ్యాణమునకు సంబంధించిన కార్యములు చేబట్టవలసినప్పటికిని ఇది చక్కని వయస్సు, పవిత్రమైన వయస్సు. ఇట్టి పవిత్ర మైన వయస్సునందు మనము చేయవలసినవి, పట్టవలసినవి పవిత్రమైన కర్మలు ఈనాడు హస్తగతమొనరించుకొని తద్వారా మన భవిష్యత్తుకు, మన భారత దేశమునకు, ఈ సంస్కృతికి కూడా సంక్షేమాన్ని అందిస్తారని నేను ఆశిస్తున్నాను. తాత్కాలికమైన సుఖ సంతోషములకు, స్వార్థానికి మనము లొంగి, పవిత్రమైన భావములను మన హృదయమునుండి దూరము చేసుకోవటానికి పూనుకో కూడదు. ఒక్కొక్క సమయములో మన మైత్రి ఎంతవరకు ఉంటుంటాదంటే, దేహములు దేహములు దూరము వదలటానికి వీలుకాని స్థితిలో వేరులు పాతుకొని ఉంటుంటాయి. అక్రూరుడు వచ్చి కృష్ణబలరాములను మధురాపురము తీసుకుని వెళ్లే సమయములో గోపికలు పడిన బాధలు గోపాలురు పడిన అగచాట్లు వర్ణనాతీతమైనవి. వీరి ఇరువురికి వున్న ప్రేమాను సంబంధమైన స్నేహములే ఇట్టి బాధలకు కారణమైపోయింది. అనేక మంది గోపికలు భయంకరమైన గుఱ్ఱములను కూడ పట్టుకొని వాటి కాళ్లను పట్టుకొని ముందుకు నడవనివ్వకుండా చేయటానికి పూనుకున్నారు. ఆ రథము చక్రములను కూడా గోపికలు పట్టి చేతకాని స్థితిలోపల వదిలించుకున్నారు. కట్టకడపటికి ఇంక భరించుకొనలేక ఎవరయ్యా నీవు. అక్రూరుడని పేరు పెట్టుకొని వచ్చావు కాని, నీవు మహాక్రూరుడవు. నీకు ఈ పేరు తగనిది అని కూడను గోపికలు నిందించారు. ఇంక విధి లేక కృష్ణుడు వెళ్లిన తరువాత ఆ మార్గమధ్యములోనే పడి ఒకరికొకరు వారి వారి పరితాపమునంతా అనేక రీతులుగా తాము వెళ్లబోసుకుంటూ వచ్చారు. ఒక గోపిక

srisathyasaivachanamrutam

చెప్పిందట.

**ఓ.. కృష్ణా! నిలువుమా! మొరవినుమా!**
**ఎవరేమనినా వెతలెన్నిడినా నీ పదములె మా గతియని తలచే**
**గోపికలను నీవీగతి చేసి మోము జూపక మధురపోయెదవా!**

ప్రేమతత్త్వములన్నియు మైత్రికి చేరినటువంటివే. కొన్ని దినములు చూచింది, కృష్ణుని రాక యశోదకు కనిపించలేదు. తిరిగి తానుకూడా ఆ ప్రేమోన్మత్తము లోపల సర్వస్వమును త్యాగము చేసి కృష్ణునియొక్క రాక కోసమై కాచి ఉన్నది.

**మురళిగానవిలోల గోపాలబాల**
**మోము జూపవదేల గోపికాలోల**
**మాతృదేవి ప్రేమ మరచితివ తండ్రీ**
**మధురకే పోయితివా మమత వీడితివా**
**యిదిగదిగొ వత్తువని యిందాక చూచితిని**
**నిలువజాలను రార నిమిషమిక తాళ ॥మురళిగానవిలోల॥**

ఇవన్నీ ప్రేమతత్త్వానికి సంబంధించినవే. ఇంక మధురకు వెళ్లిన కృష్ణుని కంసుడు అనేకరకములైన కష్టములు పెట్టి చాలా హింసించటానికి పూనుకున్నాడు. ఈ వార్త జైలులోనున్న దేవకీ వసుదేవులకు తెలిసింది. అక్కడ దేవకీదేవి ఒక తట్టు బాధపడుతున్నది. ఆమెకూడను ఎట్టి వార్త వస్తుందేమోననే ఉద్దేశ్యముతో తనయొక్క కిటికీనుండి దారులు చూచుకుంటూ చాలా బాధపడుతున్నది.

**నరరాక్షసులు చేరి పురవీధులను తరుమ**
**బాధలెన్నియు పడిరొ బలరామకృష్ణులు ॥నర॥**
**పసికందులగు మీపై కంస భూపాలుండు**
**మదగజంబులు వదల మనసెటుల ఒప్పెనో**
**కన్ననాటి మొదలు కడగండ్ల పాల్జేసి**
**కంటితో చూచు మా కర్మఫలమేమొ ॥నర॥**

sri sathyasai vachanamrutam

ఇవి అన్నియు ప్రేమతో చేరి మిత్రత్వాన్ని బలపరుస్తుంటాయి. ఇట్టి పవిత్రమైన హృదయస్థానమునుండి వెలువడే ప్రేమతో కూడినదే మైత్రిగాని సామాన్యంగా మనం ఈనాడు ఉపయోగపెట్టే మైత్రికి ఇట్టి అర్థములేమాత్రము ఉండవు.

పవిత్రాత్మస్వరూపులైన విద్యార్థులారా! ఈనాడు మనయొక్క ప్రేమను, తెలిసో తెలియకో, పూర్వము ఎట్లు ఉండినప్పటికిని ఇప్పటినుండైన మన మైత్రి తత్వాన్ని మన హృదయస్థానమునుండి అభివృద్ధి పరచే ప్రయత్నానికి పూనుకొని హృదయ పూర్వకమైన దీనితో శాశ్వతమైన మిత్రత్వాన్ని మనము పొంది భారతదేశముయొక్క మైత్రితత్వాన్ని కూడను ప్రపంచమునకు చాటటానికి తగిన ప్రయత్నము చేయాలని నేను ఆశిస్తున్నాను.

**(తేదీ 19-06-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam